


మరలిరాని లోకాలకు మట్టి మనిషి

- అందెశ్రీ స్వగ్రామం రేబర్తి
- గ్రామం వదలి 40 ఏళ్లు
- జిల్లాలో విషాదం



మద్దూరు, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వాగ్గేయకారుడు, కవి అందె ఎల్లయ్య అలియాస్ అందెశ్రీ ఇక లేరన్న విషయం తెలిసి ఆయన స్వగ్రామమైన మండలంలోని రేబర్తితో పాటు ఉమ్మడి జిల్లాలో విషాదం నెలకొంది. ఆయన చిన్ననాటి దోస్తులు, గ్రామస్థులు ఆయనతో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. మట్టిమనిషిగా ఎదిగిన అందెశ్రీకి ఉమ్మడి జిల్లాలోని సాహితీమిత్రులు, ఉపాధ్యాయులు, కవులు, కళాకారులు, పాత్రికేయులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

రేబర్తికి చెందిన అందె బొడ్డయ్య, ఎల్లవ్వ పెద్దకుమారుడైన అందె ఎల్లయ్య(అందెశ్రీ) చిన్నతనంలో కటిక పేదరికం అనుభవించారు. తినడానికి తిండి కూడా సరిగ్గా దొరకని పరిస్థితుల్లో జీతం ఉండి.. సద్ద పిసికిళ్ల (సద్దలు), సిలుపక్కపండ్లు(సీతాఫలాలు) రేగుపండ్లు, ఇరికిపండ్లు, పరికిపండ్లు తిన్న రోజులూ యాది చేసుకుంటున్నారు. గేదె మీద కూర్చొని మోట కొట్టుకుంటూ రాగం తీస్తే ఆయన స్నేహితుడు శివయ్యతో పాటు మరికొందరు 'తిన్నదరక్క రాగం దీస్తుండు' అనుకునేవాళ్లు. గ్రామాల్లో బాలనాగమ్మ, చిరుతల ఆటలు, బాగోతాలు, బుర్ర కథలు అందెశ్రీకి ప్రేరణనిచ్చాయి. బర్లు కాసే సమయంలో ఆదమరిస్తే దెబ్బలు పడ్డరోజులు యాదికొస్తే, ఇసుకలో నిద్రపోయి యాదమర్చిన సంఘటనలు స్నేహితులు గుర్తుచేశారు. అక్షర జ్ఞానం లేకపోవడంతో కర్రపుల్లతో భూమిమీద అక్షరాలు రాసే ప్రయత్నం చేస్తూ గ్రామంలోని మేర్గు జగన్నాథం సార్ వద్ద పాటలు రాయించుకున్నారు.

ఊరు దాటించిన మేస్త్రీ పని

నిజామాబాద్, చేర్యాలలలో కూలీ పనులకు వెళ్లి మేస్త్రీగా పని నేర్చుకుని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేవారు. 40 ఏళ్ల క్రితం పని కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. మేస్త్రీ పని చేస్తున్న సమయంలోనే ఓ జోగినితో పరిచయం కాస్త జోగినీల జీవితాల ఆధారంగా గంగ సినిమాకు శ్రీకారం చుట్టింది.

రాష్ట్ర గీతం దాక..

అందెశ్రీ తెలంగాణ ఉద్యమంలో పాటల ప్రవాహంగా ఎదిగి తెలంగాణ రాష్ట్ర గీతం స్థాయికి ఎదిగి ప్రత్యేక రాష్ట్ర సాధనకు పురికొల్పడానికి

మిగతా 7వ పేజీలో

మెతుకు సీమలోనే మొదటిసారి..

- 'మాయమైపోతున్నడమ్మా'.. మెదక్‌లో..
- 'జయహే తెలంగాణ'.. సిద్దిపేటలో..

మెదక్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వాగ్గేయకారుడు అందెశ్రీకి బాగా పేరు తీసుకువచ్చిన మాయమైపోతున్నడమ్మా.. అనే పాట, రాష్ట్ర గీతంగా గుర్తింపు పొందిన జయ జయహే తెలంగాణ గీతం మొదటిసారి ఆలపించింది ఉమ్మడి మెదక్ జిల్లాలోనే. ఏపీటీఎఫ్ మెదక్ యూనిట్‌కు అనుబంధంగా సాంస్కృతిక సమాలోచన వేదిక అనే సంస్థ ఆధ్వర్యంలో 2002 మేలో మెదక్‌లో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాభూమి చిత్ర దర్శక నిర్మాత నర్సింగరావు, అందెశ్రీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో అందెశ్రీ "మాయమైపోతున్నాడమ్మా.." పాటను మొదటిసారి పాడారు. రాష్ట్ర గీతంలో గుర్తింపు పొందిన 'జయ జయహే తెలంగాణ' గీతం మొదటిసారి సిద్దిపేటలో వినిపించారు అందెశ్రీ. 2003 మార్చి 2న నాటి తెలంగాణ రచయితల వేదిక వార్షికోత్సవంలో తొలిసారి ఆయన ఈ గీతాన్ని ఆలపించారు.



మునిదేవునిపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం

సంగారెడ్డి ఆర్డీవో రాజేందర్

కొండాపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతుల అభిప్రాయం మేరకే భూసేకరణ చేపడతామని సంగారెడ్డి ఆర్డీవో రాజేందర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మునిదేవునిపల్లిలో టీజీఐఐసీ పారిశ్రామిక పార్కులో భూములు కోల్పోతున్న రైతుల అభిప్రాయ సేకరణ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీజీఐఐసీ పారిశ్రామిక కారిడార్‌లో భూమి కోల్పోతున్న రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకునే పనులను కొనసాగిస్తామన్నారు. సర్వే నంబర్ 92లో 293.17 ఎకరాల భూమికి సంబంధించి 161 మంది పట్టాదారులు, 46 మంది సర్వే నంబర్ మిసింగ్, 26 మంది డీఎస్ పెండింగ్ ఉన్న రైతులు ఉన్నట్లు వెల్లడించారు. ఎండోమెంట్ సర్వే ఆధారంగా నిజనిర్ధారణ చేసి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. భూ బాధితులకు 2013 చట్టం ప్రకారం ముడింతల పరిహారం, ఉద్యోగం, 200 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని అభిప్రాయ సేకరణలో 14 మంది కోరినట్లు వెల్లడించారు. ఇతర గ్రామల చెందిన వ్యక్తులకు ఈ సర్వే నంబరు భూమిలో హక్కులను కల్పించడంపై ప్రజాప్రతినిధులు, రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదించి న్యాయం జరిగేలే చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీజీఐఐసీ మేనేజర్ శ్రీనివాస్, తహసీల్దార్ అశోక్, ఆర్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

వారంలో పరిహారం చెల్లింపు

తూప్రాన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఆర్ రహదారి నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు పరిహారం డబ్బులు నాలుగు రోజుల్లో ఖాతాల్లో జమ చేస్తామని ఆర్డీవో జయచంద్రారెడ్డి వివరించారు. తూప్రాన్ మండలంలో ప్రస్తుతం 5 గ్రామాల పరిధిలోని 201 మంది రైతుల ఖాతాల్లో రూ. 13.82 కోట్లు జమ చేయనున్నారు. మండలంలోని నర్సంపల్లి, ఇస్లాంపూర్, నాగులపల్లి గ్రామాల రైతులకు పరిహారం అందడానికి కొంత సమయం పట్టనుంది.

బడులపై ఫోకస్

ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మార్చేందుకు 'క్లీన్ అండ్ సేఫ్ 5.0' కార్యక్రమం

శుభ్రత, రక్షణ, మరమ్మతులు, సౌకర్యాలకు ప్రాధాన్యం



ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు విద్యాశాఖ 'క్లీన్ అండ్ సేఫ్ 5.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, మౌలిక వసతులు, దెబ్బతిన్న ఫర్నిచర్, శిథిలావస్థకు చేరుకున్న గదులను గుర్తించి బాగు చేయనున్నారు. పాఠశాల ప్రాంగణాలు, తరగతి గదులు, వంట గదులు, మూత్రశాలలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతోపాటు విద్యార్థులకు ఇబ్బందిరాకుండా చర్యలు చేపడతారు. సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా చేపట్టే ఈ పనులను వచ్చే నెల 5వ తేదీ వరకు పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

మెదక్ అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లావ్యాప్తంగా ప్రాథమిక 644, ప్రాథమికోన్నత 128, జెడ్పీ ఉన్నత పాఠశాలలు 146 ఉన్నాయి. ప్రతీ పాఠశాలలను శుభ్రంగా ఆకర్షణీయంగా, సురక్షితంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించారు. క్లీన్ అండ్ సేఫ్ కార్యక్రమం కోసం బడుల్లో కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో హెచ్ఎం, ఎంఈవో, అమ్మ ఆదర్శ కమిటీకి సంబంధించిన అసిస్టెంట్ ఇంజనీర్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సభ్యులుగా ఉన్నారు. మొదటగా శిథిల, ప్రమాదకర నిర్మాణాలను గుర్తించాలని ఎంఈవోలను ఆదేశించారు. అనంతరం తరగతి గదులు, కార్యాలయ, సెప్టిక్‌ట్యాంకులు, ల్యాబ్, టాయిలెట్లు, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేస్తారు. పాత ఫర్నిచర్, ప్లాస్టిక్, పాడైన వస్తువులు, మెటల్ వ్యర్థాలను వేరుచేయాలి. ఎంఈవో, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్‌శాఖ ఉద్యోగులతో కూడిన కమిటీ పర్యవేక్షించాలి. చెత్తను ఎట్టి పరిస్థితుల్లో దహనం చేయొద్దనే నిబంధన విధించారు. మధ్యాహ్న భోజనానికి ముందు విద్యార్థులు చేతులు కడుక్కునేలా అవగాహన కల్పిస్తారు. చెదలు, దోమలు లేకుండా చూస్తూ నీడనిచ్చే, చెట్లు, పూలమొక్కలు నాటాలి. పాఠశాల గోడలపై ఆరోగ్య సందేశాలు రాయిస్తారు.

షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు



జిల్లాలోని బడుల రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం క్లీన్ అండ్ సేఫ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. షెడ్యూల్ ప్రకారం వచ్చే నెల 5 వరకు కొనసాగుతోంది. అవసరమైన మౌలిక వసతులను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

-రాధాకిషన్, మెదక్ డీఈవో

విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం

పాఠశాల విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో ప్రమాదాల బారినపడకుండా పనులు చేపడుతారు. విద్యుత్, వైర్లు, స్విచ్‌లు తనిఖీచేసి దెబ్బతిన్నవి మార్చేస్తారు. బోర్డులు, బెంచీలు, టేబుళ్లు కూడా పకడ్బందీగా బిగిస్తారు. ఇక విద్యార్థులు వంట గదుల్లోకి రాకుండా పర్యవేక్షించాలి. ఆపై ఎల్పీజీ గ్యాస్‌సిలిండర్లను తనిఖీచేసి లోపాలుంటే సరిచేయించాలి. ఈ పనులు పూర్తయిన అనంతరం ఆసుపత్రి, పోలీసు శాఖ, అగ్నిమాపకశాఖ ఉద్యోగుల ఫోన్ నంబర్లను గోడలపై రాయిస్తారు.

వసతిగృహానికి గ్రహణం

- సంగారెడ్డిలో నత్తనడకన బీసీ హాస్టల్ భవనం
- రూ.2.90 కోట్లతో ప్రతిపాదనలు
- ఏడాదిలో పూర్తి చేయాలని ఒప్పందం
- మూడేళ్లు దాటినా అసంపూర్తిగానే..
- అద్దె భవనంలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు


సంగారెడ్డిలో అసంపూర్తిగా ఉన్న బీసీ హాస్టల్ భవనం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని పాత డీఆర్‌డీఏ కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న బీసీ కళాశాల హాస్టల్ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధుల విడుదలలో జాప్యం కారణంగా మూడేళ్లుగా అసంపూర్తిగానే ఉన్నాయి. సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని పాత డీఆర్‌డీఏ కార్యాలయం ప్రాంగణంలో రూ.2.90 కోట్లతో జీ+1 భవన నిర్మాణానికి 2022లో శంకుస్థాపన చేశారు. టీజీఈడబ్ల్యుఐడీసీ నిర్మాణ సంస్థ పనులు చేపట్టగా, ఏడాదిలో పూర్తిచేసి అప్పగించాలని కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసుకున్నారు. నిర్మాణ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. ఫ్లోరింగ్, బండలు, కిటికీలు, తలుపులు, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, పెయింటింగ్ తదితర పనులు మాత్రమే మిగిలి ఉన్నా నిధులు లేకపోవడంతో నిలిచిపోయాయి. సొంత భవనం పూర్తి కాకపోవడంతో బీసీ కళాశాల హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతున్నది. మూడేళ్లుగా అరకొర సౌకర్యాల నడుమ విద్యార్థినులు అద్దె భవనాల్లో అసౌకర్యాల మధ్యనే కాలం వెల్లదీస్తున్నారు. ప్రభుత్వం స్పందించి హాస్టల్ భవనాన్ని త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థినులు కోరుతున్నారు.

పరమేశ్వరుడికి 108 కళశాలతో అభిషేకం



కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం శేరితండాలోని శివాలయంలో వెలసిన పరమేశ్వరుడికి విశేష పూజలు, అభిషేకం నిర్వహించారు. మండల కేంద్రంలోని అభయ రామాలయం నుంచి 108 మంది మహిళలు 108 కళశాలతో జలాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి శివుడిని అభిషేకించారు.

-కౌడిపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి)

భక్తిశ్రద్ధలతో పాండురంగస్వామి గరుడవాహన సేవ



సంగారెడ్డి జిల్లా కందిలోని 200 ఏళ్ల చరిత్ర కలిగిన రుక్మిణి పాండురంగ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం గరుడ వాహన సేవ అట్టహాసంగా నిర్వహించారు. భజనలు, కోలాటాలు, సాంస్కృతిక నృత్యాలతో భక్తులు ఆహ్వానం పలికారు. అనంతరం ఆలయ ఆవరణలో గోపాలకాలువల కార్యక్రమాన్ని నిర్వహించారు.

-కంది, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి)


మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్

రోడ్ల మరమ్మతులు వేగవంతంగా చేయాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులు వేగవంతం చేయాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో వివిధ శాఖల అభివృద్ధి పనులపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్ల పనులకు వెంటనే టెండర్లు పిలవాలని సూచించారు. ఎన్నికల విధుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించరాదని పేర్కొన్నారు. బీఎల్‌వోలు తమ ఆన్‌లైన్ యాప్‌లో ఇప్పటికీ లాగిన్ కాలేదని అలాంటి సమస్యలు ఇక ముందు పునరావృతం కావద్దని సూచించారు. తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ల నుంచి కలెక్టరేట్‌కు వచ్చే ఫైళ్లను పూర్తి సమాచారంతో పంపించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో పద్మజరాణి, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూములు ఇచ్చిన మాపైనే జులుమా?

- కాంట్రాక్టర్‌ను తొలగించాలి
- ఐఐటీహెచ్ గేటు ఎదుట బైఠాయించిన సిబ్బంది

7

ఆపదలో అంబులెన్స్‌లు



- కిలోమీటర్ల పరిమితి దాటిన వాహనాలు
- మొరాయిస్తున్న ఖేడ్, మనూరు 108 అంబులెన్స్‌లు
- ఖేడ్ ఏరియా ఆస్పత్రిలోని అంబులెన్స్ నిలిపివేత

7

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

హైవే 65 పక్కన విలువైన స్థలం అన్యాక్రాంతం

సదాశివపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సదాశివపేట మున్సిపాలిటీ పరిధిలో 65వ నంబరు జాతీయ రహదారిని అనుకుని ఉన్న రూ. కోట్ల విలువైన కందకం స్థలం అన్యాక్రాంతమవుతున్నది. మార్కెట్‌లో చదరపు గజం రూ. లక్షకు పైగా పలుకుతున్న ప్రభుత్వ స్థలం కబ్జాలబారిన పడి కనుమరుగవుతున్నది. కందకం స్థలాన్ని కాపాడాలని 2010లో హైకోర్టు మున్సిపల్, రెవెన్యూశాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కానీ, ఇప్పటికీ అక్రమ నిర్మాణాలు పుట్టగొడుల్లా పుట్టుకొస్తున్నాయి. బల్దియా పాలకవర్గం ఉన్నప్పుడు అక్రమ నిర్మాణాలు, ప్రజా సమస్యలపై కౌన్సిల్ సమావేశాల్లో చర్చించేవారు. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలనలో ప్రశ్నించేవారు కరువయ్యారు. పట్టణంలో కందకం స్థలంతో పాటు అనేక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతున్నది. అక్రమ నిర్మాణాలను నిలువరించాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది అటు దిక్కుగా వెళ్లడం లేదనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమణలకు అడ్డు లేకుండాపోయింది. బల్దియా రెవెన్యూ విభాగం అధికారులు కందకం స్థలంలో వెలసిన అక్రమనిర్మాణాలకు ఇంటి నంబర్లు కేయించి, ఆస్తి పన్నులు విధిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. తాత్కాలిక నిర్మాణాలు, షెడ్లు వేసుకున్న కబ్జాదారులకు ఇంటి నంబర్లు కేటాయిండంతో వాటి ఆధారంగా అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్టు సమాచారం. పట్టణంలో ఎక్కడ చూసినా నిబంధనలను అతిక్రమించి భవనాల నిర్మాణాలు కొనసాగుతుండడం గమనార్హం. రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ నిర్మాణలు, స్టిల్ట్ అనుమతులు పొందిన తరువాత లోతైన సెల్లార్‌లు తవ్వి భారీ కమర్షియల్ భవనాలు నిర్మించడం సర్వసాధారణమైంది. కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం పట్టణాల్లో

మిగతా 8వ పేజీలో


సదాశివపేట పట్టణంలో అక్రమ నిర్మాణం

గజగజ..

వణుకుతున్న ఉమ్మడి జిల్లా

- సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 11.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- సిద్దిపేట జిల్లా మార్కుక్‌లో 11.8 డిగ్రీలు
- మెదక్ జిల్లా హవేళీఘనపూర్‌లో 12.3 డిగ్రీలు



మెదక్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చలి విజృంభిస్తున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యల్ప రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మూడు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో రాష్ట్రంలోనే ద్వితీయస్థానంలో నిలుస్తుండడం గమనార్హం. ఉదయం 10 గంటల వరకు చలిగాలులు వీస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోనే అత్యల్పంగా సోమవారం సంగారెడ్డి జిల్లాలోని కోహీర్‌లో 11.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లా మర్కుక్‌లో 11.8 డిగ్రీలు, మెదక్ జిల్లా హవేలీఘనపూర్‌లో 12.3 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. న్యాల్‌కల్‌లో 11.4 డిగ్రీలు, మొగుడంపల్లిలో 11.4 డిగ్రీలు, గుమ్మడిదలలో 11.8 డిగ్రీలు, కొండపాకలో 12.1 డిగ్రీలు, హవేలీఘనపూర్‌లో 12.3 డిగ్రీలు, నర్సాపూర్‌లో 12.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వచ్చే వారం రోజులు ఉష్ణోగ్రతలు మరింత తగ్గిపోయే అవకాశం ఉందని సీపీవో కార్యాలయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రాత్రి ఏడు గంటలకే చలిగాలులకు వీధుల్లో జనసంచారం లేక నిర్మానుష్యమవుతున్నాయి. చలి తీవ్రతకు పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్తమా బాధితులు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. పక్షవాతం తదితర రోగులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మున్సిపల్, పంచాయితీ పారిశుధ్య కార్మికులు తెల్లవారుజామున వీధులు శుభ్రం చేస్తున్న సమయంలో చలికి తట్టుకోలేకపోతున్నామని వాపోతున్నారు.

కల్లు దుకాణంలో వలస కార్మికుడి మృతి

● ముప్పిరెడ్డిపల్లిలో చోటుచేసుకున్న ఘటన


కల్లు దుకాణంలో కాళీ చరణ్ మృతదేహం

మనోహరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామంలోని కల్లు దుకాణంలో ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మేస్త్రీ కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలసొచ్చిన కాళీ చరణ్ (35)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పది రోజుల క్రితం ఒక పరిశ్రమలో మేస్త్రీ పని నిమిత్తం ముప్పిరెడ్డిపల్లికి వచ్చాడు. ఆదివారం రాత్రి గ్రామంలోని చెంది మహేష్ కల్లు దుకాణానికి వెళ్లాడు. సోమవారం ఉదయం దుకాణ యజమాని కల్లు దుకాణంలో కాళీ చరణ్ పడిఉండడాన్ని గుర్తించాడు. విషయం తెలిసి పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాళీచరణ్ పాలివాడు అంకిత్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుకోని దర్యాప్తు చేస్తున్నారు. అయితే, కాళీచరణ్ కల్లు దుకాణంలో చనిపోతే గుండెపోటుతో మృతిచెందాడని స్నేహితుడు చెప్పడంపై గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

సంగారెడ్డి క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : లారీ డ్రైవర్ అజాగ్రత్త, అతి వేగం కారణంగా ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ పట్టణానికి చెందిన ఎర్రొళ్ల శామ్యూల్ అతని భార్య ఎర్రొళ్ల సునీత(40) కలిసి బైక్‌పై శంకర్‌పల్లి మండలం ఫతేపూర్ గ్రామానికి వెళ్లారు. తిరిగి తమ స్వగ్రామమైన మెదక్ పట్టణానికి సోమవారం బైక్‌పై వెళ్తుండగా సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో లారీ ఢీకొన్నది. దీంతో బైక్‌పై ఉన్న సునీత లారీ చక్రాల కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త శామ్యూల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..


పాల్యా రాందాస్ (ఫైల్)

రేగోడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన రేగోడు మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. బురన్‌వాడి తండాకు చెందిన పాల్యా రాందాస్(44) ఆదివారం రాత్రి తన వ్యవసాయ భూమిలో ఉన్న పశువుల షెడ్‌లో లైట్ వేయడానికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో తండ్రి అంబర్యానాయక్ వెళ్లి చూడగా విద్యుత్ వైర్ తగిలి మృతి చెందినట్లు గుర్తించారు. రాందాస్ నాయక్‌కు భార్య, ఒక బాబు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య సునీతబాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పోచయ్య సోమవారం తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

పటాన్‌చెరు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి ఔటర్ సర్వీస్ రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

రామాయంపేటలో...

రామాయంపేట, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సోమవారం సాయంత్రం అపస్మారకస్థితిలో పడి ఉన్న అతడిని పలువురు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై బాలరాజ్ అక్కడికి చేరుకొని చూడగా అతను అప్పటికే చనిపోయాడు. సుమారు 55 ఏళ్ల వయస్సున్న ఆయన ఎడమ చేతిపై ఎన్టీఆర్ అని పచ్చబొట్టుతో రాసి ఉందని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిజాంపేటలో దొంగల బీభత్సం

● బంగారం, వెండి నగలు అపహరణ

నారాయణఖేడ్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేటకు చెందిన మర్రి దత్తు, భార్య కావేరి తమ ఇంటికి తాళం వేసి సమీపంలోని మునిగేపల్లిలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి ఆదివారం రాత్రి వెళ్లారు. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లో ప్రవేశించి బీరువాలో దాచి ఉంచిన నాలుగు తులాల బంగారు నగలు, 30 తులాల వెండిని అపహరించుకుపోయారు. ఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, వారి గృహాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి, క్లూస్‌టీంను రప్పించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగలను గుర్తించేందుకు యత్నిస్తున్నామని ఎస్ఐ శ్రీశైలం తెలిపారు.

విద్యుత్ తీగల అపహరణ

పట్టించుకోని అధికారులు

మనూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మనూరు మండల పరిధిలోని పుల్‌కూర్తి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన విద్యుత్ తీగలు చోరీకి గురైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎత్తిపోతల పథకం నిర్మించినప్పటికీ ఆ పథకం పని చేయడం లేదు. దీంతో విద్యుత్ లైన్ నిరుపయోగంగా ఉంటుంది. ఇది గమనించిన కొందరు 27 స్తంభాల నుంచి వెళుతున్న విద్యుత్ తీగను (అల్యూమినీయం వైర్) దొంగిలించుకు వెళ్లారు. ఎత్తిపోతల పథకానికి సంబంధించిన అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఈ విషయాన్ని తెలిపినప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదని పుల్‌కూర్తి గ్రామస్థులు పేర్కొన్నారు. విద్యుత్ వైర్ చోరీపై పలు అనుమానాలు వ్యక్తమతున్నాయని వారు తెలిపారు.

అత్యాచారం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

రామచంద్రాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు, రూ. 2వేల జరిమానా విధిస్తూ సంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు మెజిస్ట్రేట్ కె.జయంతి సోమవారం తీర్పు వెల్లడించారు. గతేడాది తెల్లాపూర్ ఆకృతి లేబర్ క్యాంప్‌లో నివాసముంటున్న రాజేందర్ భూయాన్(45) అదే క్యాంప్‌లో ఉంటున్న బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అప్పట్లో సీఐ రవీందర్ కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసును వాదించిన బి.సూరారెడ్డి పబ్లిక్ ప్రాసిక్యూటర్, దర్యాప్తు అధికారులు ఎస్ఐ ఎస్.సురేష్, సీఐలు గణేష్ పటేల్, కే.రవీందర్, కానిస్టేబుళ్లు దర్యాప్తులో పాల్గొన్నారు.


పక్కన పెట్టిన ఖేడ్ ఏరియా ఆస్పత్రి అంబులెన్స్ వాహనం

ఆపదలో అంబులెన్స్‌లు

- కిలోమీటర్ల పరిమితి దాటిన వాహనాలు
- మొరాయిస్తున్న ఖేడ్, మనూరు 108 అంబులెన్స్‌లు
- ఖేడ్ ఏరియా ఆస్పత్రిలోని అంబులెన్స్ నిలిపివేత
- ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పనిస్థితి
- సేవలపై ప్రభుత్వ నిర్లక్ష్యం


ఖేడ్‌లోని కాలంచెల్లిన 108 అంబులెన్స్ వాహనం

నారాయణఖేడ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర వైద్య సేవలకు వెన్నెముకగా నిలిచే 108 వాహనాలకు తోడు స్థానిక ఏరియా ఆసుపత్రి అంబులెన్స్‌లు కాలం చెల్లిపోవడంతో ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయి. గతంలో గర్భిణులు, రోడ్డు ప్రమాద బాధితులకు ఈ అంబులెన్స్‌లు సంజీవనిలా ఉపయోగపడ్డాయి. ఈ సేవలు ప్రస్తుతం ప్రభుత్వ నిర్లక్ష్యంతో దారుణమైన స్థితికి చేరుకున్నాయి.

3 లక్షల కి.మీ.లకు మించి..

నారాయణఖేడ్, మనూరులోని 108 వాహనాలు కాలం చెల్లిపోయాయి. ప్రమాదంలో ఉన్న వారిని హుటాహుటిన వైద్యశాలలకు చేర్పించే వాహనాలను 3 లక్షల కిలోమీటర్ల వరకే తిప్పాల్సి ఉంటుంది. ఈ రెండు 108 వాహనాలు మూడున్నర నుంచి నాలుగు లక్షల కిలోమీటర్ల వరకు ప్రయాణం చేశాయి. దీంతో అవి రోగులను తీసుకెళ్తున్న క్రమంలో అనేక మార్లు మొరాయించాయి. ప్రస్తుతం ఫోన్ చేసిన గంటల అనంతరం కూడా 108 వాహనాలు రోగుల వద్దకు చేరుకునే పరిస్థితి లేదు. స్థానిక ఏరియా ఆసుపత్రికి కేటాయించిన అంబులెన్స్ ఏకంగా 4.5 లక్షల కిలోమీటర్లు తిరగడంతో, సురక్షితం కాదని వారం రోజులుగా వాహనాన్ని నిలిపివేశారు. ఇటీవల ఖేడ్‌కు డిప్యూటేషన్‌పై నియామకమైన డ్రైవర్లు కూడా అంబులెన్స్ వాహనాన్ని నిలిపి సంగారెడ్డికి వెళ్లినట్లు తెలిసింది. నారాయణఖేడ్‌కు గత ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి ద్వారా మంజూరైన ఓమిని అంబులెన్స్ రిజిష్ట్రేషన్ చేయించకపోవడంతో దానిని కూడా జిల్లా వైద్యశాలల కోఆర్డినేటర్ సూచన మేరకు సంగారెడ్డిలోనే నిలిపిఉంచారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో (సంగారెడ్డి, హైదరాబాద్‌కు తరలించాల్సిన) రోగులు తప్పనిసరిగా ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది.

ఖేడ్ డివిజన్‌లో ఇదీ పరిస్థితి..

నారాయణఖేడ్, మనూరు మండలాలకు కాలం చెల్లిన వాహనాలు ఉండగా, నాగల్‌గిద్ద, నిజాంపేట వంటి మారుమూల మండలాలకు 108 వాహనాల జాడే లేదు. కల్హేర్, సిర్గాపూర్, కంగ్టి మండలాల్లో మాత్రమే నూతన వాహనాలు అందుబాటులో ఉన్నాయి.

వెంటనే కొత్త వాహనాలు ఇవ్వాలి

వెంటనే కాలంచెల్లిన అంబులెన్స్‌ల స్థానంలో కొత్త వాహనాలను ఇవ్వాలని, మారుమూల ప్రాంతాలైన నాగల్‌గిద్ద, నిజాంపేట మండలాలకు కూడా కొత్త 108 వాహనాలను మంజూరు చేయాలని ఖేడ్ ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఖేడ్ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.జి.రమేష్‌ను సంప్రదించగా, డ్రైవర్లు లిఖితపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు అంబులెన్స్‌ను నిలిపివేసినట్టు అంగీకరించారు. ఈ విషయాన్ని జిల్లా సమన్వయకర్తతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.



టీకొట్టులోకి దూసుకెళ్లిన కారు

చేగుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టీకొట్టులోకి కారు దూసుకెళ్లిన సంఘటన మెదక్ జిల్లా నార్సింగి మండలం వల్లూరు గ్రామం పరిధిలోని 44వ జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకున్నది. నార్సింగి ఎస్సై సృజన తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు వల్లూర్ శివారులో బీభత్సం సృష్టించింది. ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి కారు పక్కనే ఉన్న టీ కొట్టులోకి దూసుకెళ్లింది. అక్కడే టీ తాగుతున్న భీంరావ్‌పల్లి గ్రామానికి చెందిన ఇప్పకింది నరసింహులుకు గాయాలయ్యాయి. బైక్, టీ కొట్టు పూర్తిగా ధ్వంసమైంది.

భూములు ఇచ్చిన మాపైనే జులుమా?

- వేతనాలు అడిగితే బెదిరిస్తున్న కాంట్రాక్టర్‌ను తొలగించాలి
- ఐఐటీహెచ్ గేటు ఎదుట బైఠాయించిన సిబ్బంది


ఐఐటీహెచ్ గేట్ వద్ద బైఠాయించిన కాంట్రాక్టు కార్మికులు

కంది, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌కు భూములు ఇచ్చిన తమపైనే జులుం ప్రదర్శిస్తున్నారని, క్యాంపస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు మండిపడ్డారు. వేతనాలు సకాలంలో రావడంలేదని, కాంట్రాక్టర్ వేధింపులకు గురి చేస్తున్నాడని సోమవారం ఐఐటీహెచ్ గేటు ఎదుట బైఠాయించి వారు ధర్నా నిర్వహించారు. క్యాంపస్‌లో పనిచేస్తున్న హౌస్ కీపింగ్, గార్డెనింగ్, సెక్యూరిటీ తదితర విభాగాల్లోని దాదాపు 400 మంది ఏక కాలంలో విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఎప్పుడూ ఒకటి నుంచి ఐదో తారీకు లోపే వేతనాలు తమ అకౌంట్లో పడేవని తెలిపారు. ఇప్పుడున్న కాంట్రాక్టర్ పదో తేదీ వచ్చినా కూడా వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు. ఇదేమిటని అడిగిన వారిని బెదిరింపులకు గురి చేస్తున్నారని వారు పేర్కొన్నారు. వేతనాల విషయంలో, యూనిఫాం విషయంలో తీవ్ర వ్యత్యాసం చూపిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కాంట్రాక్టు ఉద్యోగం తీసేస్తానని బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఉద్యోగులు వాపోయారు. ఐఐటీ హైదరాబాద్ నిర్మాణం కోసం తాము వ్యవసాయ భూముల్ని ఇస్తే తమకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వకుండా కాంట్రాక్టు ఉద్యోగాలతో సరిపెట్టారని అన్నారు. ఇప్పుడు కనీసం కాంట్రాక్ట్ ఉద్యోగాల జీతాలు సకాలంలో ఇవ్వకుండా మాపైనే బెదిరింపులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని వారు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే కాంట్రాక్టర్‌ను మార్పించి తమకు వేతనాలు సకాలంలో అందేలా చూడాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా ఈఎస్ఐపీఎఫ్ లు కూడా అందేలాగా చర్యలు తీసుకోవాలని ఐఐటీహెచ్‌లో పనిచేస్తున్న సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

నవరత్న క్రాప్‌సైన్స్‌తో ఉద్యాన వర్సిటీ ఒప్పందం


ఒప్పందం కుదుర్చుకున్న దృశ్యం

ములుగు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కి చెందిన నవరత్న క్రాప్‌సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మూడు సంవత్సరాల పాటు అమల్లో ఉండే ఈ ఒప్పందం ద్వారా విద్యా పరిశోధన విస్తరణ రంగాల బలోపేతమే లక్ష్యం. విద్యార్థులకు క్షేత్ర శిక్షణ, ఫెలోషిప్‌లు అందజేయడంతో పాటు అధ్యాపకుల మార్పిడికి సహకరించనున్నారు. ఇరువైపులా ప్రయోగశాలలు, పరికరాలు, సాంకేతిక నైపుణ్యాలు పంచుకోగా, మేథోసంపత్తి హక్కులు ఉమ్మడిగా ఉంటాయి. కార్యక్రమంలో వీసీ దండ రాజిరెడ్డి, రిజిస్ట్రార్ భగవాన్, నవరత్న సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మొహమ్మద్‌అలీ, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

మరలిరాని లోకాలకు మట్టి మనిషి


మద్దూరు మండలం రేబర్తిలోని అందెశ్రీ పాత ఇల్లు

(5వ పేజీ తరువాయి)

జీవం పోశాయి అందెశ్రీ పాటలు. తెలంగాణ అవతరించిన తర్వాత అందెశ్రీకి ప్రత్యేక గౌరవం దక్కింది. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత వరకు పసి హృదయాల్లో పల్లవించేలా రాసిన 'జయ జయహే తెలంగాణ.. జననీ జయకేతనం' చరిత్రలో చిరస్థాయిగా నిలిపోయేలా చేశాయి. తన పాటకు బాణీలు కూర్చిన రామాచారికి, గానం చేసిన రామకృష్ణకు తన కీర్తిలో కొంత భాగం దక్కుతుందని అప్పట్లో చెప్పారు. అందెశ్రీ కాకతీయ విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. సినీ ప్రపంచానికి ఎంతో మధురమైన పాటలనందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో కీలక భూమికగా పనిచేసిన అందేశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'ను తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రకటించి, ఆయకు రూ. కోటి నగదు బహుమతి అందించి ఘనంగా సత్కరించారు.

అందెశ్రీ విన్నపంతో కదిలిన యంత్రాంగం

మద్దూరు మండలం రేబర్తిలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని అందెశ్రీ సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించడంతోనే, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సిద్దిపేట కలెక్టర్ హైమావతి, తెలంగాణ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఈడబ్ల్యూఐడీసీ) ఎండీ గణపతిరెడ్డికి ఆదేశాలు జారీ అయ్యాయి. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాస్‌రెడ్డి తన బృందంతో కలిసి పాఠశాలను సందర్శించారు. కొత్తగా ఏర్పాటు కాబోతున్న 5 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌లో భాగంగా రేబర్తి పాఠశాలను అప్‌గ్రేడ్ చేసే అంశం తమ పరిధిలో లేనందున దీనిపై ప్రభుత్వానికి లేఖ రాయాలని విన్నవించారు. పూర్వపు వరంగల్ జిల్లాలో కొనసాగిన జనగామలోని మద్దూరు మండలాన్ని ప్రస్తుత జనగామ జిల్లాలో కలుపాలని సీఎంకు విన్నవించనున్నట్లు తెలిపారు.

చేర్యాల అల్లుడు

చేర్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, కవి అందెశ్రీకి చేర్యాలతో విడదీయరాని బంధం ఉంది. గొర్రెల కాపరిగా, మేస్త్రీగా పనిచేసిన ఆయన నిజామాబాద్ ప్రాంతానికి వలసవెళ్లి 1980లో స్వగ్రామానికి తిరిగి వచ్చి, చేర్యాలలో మేస్త్రీ పని చేశారు. ఈ క్రమంలో చేర్యాల శివారు బండపల్లి కాలనీకి చెందిన గడిపె బాలవ్వా-యాదగిరి నాలుగో సంతానమైన మల్లవ్వను మనువాడారు. అందెశ్రీ అత్త, మామలు చాన్నాళ్లక్రితమే మరణించగా, బండపల్లి కాలనీలో బావమరిది బాలనర్సు నివసిస్తున్నారు. పండుగలు, శుభకార్యాలకు అందెశ్రీ అప్పుడప్పుడు వచ్చివెళుతుండేవాడు. ఈక్రమంలో అందెశ్రీ మృతి పట్ల అత్తింటి వారితో పాటు కాలనీవాసులు విషాదంలో మునిగిపోయారు.

అందెశ్రీ ఆశయాన్ని సీఎం నెరవేర్చాలి

రాష్ట్రానికి అజరామర గీతాన్ని అందించిన అందెశ్రీ గ్రామంలో విద్యాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేయాలి. నా చిన్ననాటి దోస్తు మృతి చెందాడన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. ఆయన కుటుంబానికి ఆ దేవుడు ధైర్యాన్ని ప్రసాదించాలి.

- బొమ్మగాని శివయ్య, రేబర్తి చిన్ననాటి స్నేహితుడు

గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తే బాగుండు

40 యేండ్ల క్రితం ఊరు వదిలి వెళ్లారు. ఎంతో గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. గ్రామానికి వస్తే మంచి చెడు మాట్లాడేవారు. ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తే బాగుండేది. బంధువులంతా ఇక్కడే ఉన్నారు.

- అందె పర్శయ్య, అందెశ్రీ అన్న కుమారుడు

ట్యాంకుబండ్‌పై విగ్రహం ఏర్పాటు చేయాలి

తెలంగాణ రాష్ట్రానికి చరిత్రలో మర్చిపోలేని గీతాన్ని అందించిన అందెశ్రీ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలి. తెలంగాణ సాహిత్యలోకానికి అందెశ్రీ మరణం తీరనిలోటు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర ఏర్పాటుకు ఉర్రూతలూగించిన ఉద్యమగీతాలు ప్రత్యేక రాష్ట్రసాధనకు తోడ్పాటునందించాయి. అయన మరణం తీరని లోటు కుటుంబానికి ఆభగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలి.

- గిరి కొండల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ

జిల్లాకు అందెశ్రీ పేరు పెట్టాలి

సిద్దిపేట జిల్లాకు అందె శ్రీ పేరు పెట్టి ప్రత్యేక గౌరవాన్ని అందించాలి. అందె శ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు. ఆయన మృతి ఈ రాష్ట్ర ప్రజలకు దిగ్భ్రాంతికి గురి చేసింది.

- నాగపురి కిరణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు

న్యూస్ బాక్స్

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శిగా సాబేర్‌అలీ



సంగారెడ్డి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్(ఎస్టీయూ) రాష్ట్ర ఆర్థిక కార్యదర్శిగా సయ్యద్‌సాబేర్ అలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ పటిష్టత, అభివృద్ధి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకం పట్ల రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సదానందగౌడ్, గజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ దగ్ధం కేసును ఛేదించిన పోలీసులు

వెల్దుర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బైక్ దగ్ధం కేసును పోలీసులు ఛేదించారు. మండల పరిధిలోని కుకునూర్ గ్రామానికి చెందిన బానాపూరం నర్సింలు ఆదివారం రాత్రి తన ఇంటి ముందు బైక్‌ను పార్క్‌చేసి ఇంట్లో నిద్రిస్తున్నాడు. 10.30 నిమిషాల సమయంలో టైర్ పేలిన శబ్దం రావడంతో మొదట తన కుమారుడు మధు వెళ్లి చూడగా బైక్ మంటల్లో కాలిపోతుందని కుటుంబసభ్యులకు చెప్పాడు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా అప్పటికే బైక్ పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న తూప్రాన్ సీఐ రంగకృష్ణ, ఎస్ఐ రాజు రాజుకు తెలిపిందన్నారు.

బ్యాంకు శాఖ ఏర్పాటుకు పరిశీలన

జిన్నారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం జిన్నారంలో డీసీసీబీ బ్యాంకుశాఖ ఏర్పాటు కోసం భవనాలను ఏజీఎం వెంకటేశ్, అధికారులు పరిశీలించారు. మున్సిపల్ కేంద్రంలో బ్యాంకు బ్రాంచి ఏర్పాటుకు యోచిస్తున్నారు.

ప్రజావాణికి 31 దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలని సంగారెడ్డి కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 31 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక కబ్జా చెర నుంచి విడిపించండి

కంది, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని మక్తాఅల్లూరులో ఎస్సీలకు చెందిన 20 గుంటల శ్మశానవాటిక కబ్జాకోరల్లో చిక్కుకుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మాజీ ఉపసర్పంచ్ నర్సింహులు ఆధ్వర్యంలో గ్రామస్థులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

సంగారెడ్డి క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించడమే పోలీసుల ధ్యేయమని ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్జీదారుల నుంచి ఆయన వినతిపత్రాలు స్వీకరించి మాట్లాడారు. తమ సమస్యలపై ప్రజలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు. పోలీసుశాఖ ప్రజలకు మరింత చేరువయ్యేందుకే ప్రజావాణి నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

మొక్కుబడిగా ప్రజావాణి

కోహీర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి మొక్కుబడిగా సాగింది. ప్రజావాణికి ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటలైనా పూర్తిస్థాయిలో అధికారులు కార్యాలయానికి రాలేదు. ప్రతీవారం ఇలాగే జరుగుతుండడంతో ప్రజలు ప్రజావాణికి రావడమే మానేశారు. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి ప్రజావాణిని పకడ్బందీగా నిర్వహించి, మండలస్థాయి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఆరోగ్యం కోసం ఆహారం తీసుకోవాలి : ఎమ్మెల్యే

చిలప్‌చెడ్/వెల్దుర్తి/మనోహరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆహారం రుచి కోసం కాకుండా.. ఆరోగ్యం కోసం తీసుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ మాసోత్సవాలు, బాల్య వివాహ నిషేధిత చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఉత్తమ అంగన్‌వాడీ టీచర్లకు, హెల్త్ సూపర్‌వైజర్లకు, ఏఎన్ఎం, ఆశావర్కర్లకు, ఏపీఎం, సీఏ, సీసీ, పంచాయతీ కార్యదర్శులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా డీడబ్ల్యూ హేమభార్గవి, తహసీల్దార్ సహదేవ్, ఎంపీడీవో ప్రవీణ్, ఎస్ఐ నర్సింలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత పాల్గొన్నారు. అలాగే వెల్దుర్తి మండల పరిధిలోని మన్నెవారి జలాల్‌పూర్ కాళీమాత ఆలయంలో సునీతారెడ్డి శివలింగాలకు అభిషేకం, హోమం, పూజలు నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మనోహరాబాద్ మండలం గౌతోజిగూడకు చెందిన తలారి నర్సింహులుకు మంజూరైన రూ.24 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.



గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న సునీతారెడ్డి

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే రోహిత్

మెదక్, కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులు ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. సోమవారం మెదక్ మండలం కొంటూర్ పెద్ద చెరువులో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై 1,84,500 లక్షల చేప పిల్లలను వదిలి మాట్లాడారు. ఉచిత చేప పిల్లల పంపిణీతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, ఎల్లబోయిన ప్రశాంత్, డైరెక్టర్ జీ.దేవేందర్, జీ.అంజయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

తెలంగాణ ఉద్యమ పిడికిలి అందెశ్రీ : టీపీటీఎఫ్

మెదక్ అర్బన్/మెదక్ కల్చరల్/చిన్నశంకరంపేట/మెదక్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అస్తిత్వ ఉద్యమానికి బిగిసిన పిడికిలి అందెశ్రీ అని టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రాందాస్ చౌరస్తాలో అందెశ్రీ చిత్రపటానికి వారు పూలమాలవేసి ప్రజా సంఘాలతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మధుసూదన్‌రావు, మానవ హక్కుల వేదిక నేత అహ్మద్, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు. మెదక్‌లో తెలంగాణ రచయితల సంఘం మెదక్ జిల్లా అధ్యక్షురాలు కవిత అందెశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు అందెశ్రీ ఫొటోకు నివాళులర్పించి, మౌనం పాటించారు. అందెశ్రీ మృతి సాహిత్యలోకానికి తీరని లోటని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు యాదగిరి, లక్ష్మణ్ పేర్కొన్నారు. సోమవారం మాసాయిపేటలో వారు మాట్లాడారు.



అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గుర్తింపు లేని విత్తనాలు వాడొద్దు

- మెదక్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్‌కుమార్

చేగుంట/నిజాంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు గుర్తింపు లేని విత్తనాలను వాడొద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం చేగుంట మండలం రుక్మాపూర్‌లో గుర్తింపులేని విత్తనాలతో పంట నష్టపోయిన రైతుల పొలాలను పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో 40 మంది రైతులు 45 47 రకం వరి విత్తనాలు వేసి పంట నష్టపోవడం చాలా బాధాకరమన్నారు. శాస్త్రవేత్తల ద్వారా పరిశోధనలు జరిపి రైతులకు న్యాయం జరిగేవిధంగా చూస్తామన్నారు. ఆయన వెంట వ్యవసాయ అధికారులు హరిప్రసాద్, యాదగిరి, రైతులు ఉన్నారు. సేంద్రియ సాగుతో భూసారాన్ని కాపాడుకోవడమే కాక ప్రకృతిని సంరక్షించుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్ అన్నారు. సోమవారం నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట్ల గ్రామంలో రైతు పండించే సేంద్రియ వరి పంటను సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంకేతిక అధికారి యాదగిరి, మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, పీఏసీఎస్ సీఈవో గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



రుక్మాపూర్‌లో పంట పొలాలను పరిశీలిస్తున్న దేవ్‌కుమార్

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

- జహీరాబాద్ ఆత్మ కమిటీ చైర్మన్

జహీరాబాద్/చిన్నశంకరంపేట/టేక్మాల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దళారులను ఆశ్రయించి రైతులు మోసపోకుండా తాము పడించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లబ్ధిపొందాలని జహీరాబాద్ ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి అన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలో జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ముబీన్, మార్కెట్ కమిటీ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు రుద్రారం, కామారం గ్రామాల్లోని సహకార సంఘం, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ మాలతి సందర్శించారు. అలాటే టేక్మాల్ మండలం సూరంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం గోపాల్ ప్రారంభించారు.

వైభవంగా వీరభద్రేశ్వరస్వామి కల్యాణం

రేగోడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రకాళి వీరభద్రేశ్వరస్వామి కల్యాణోత్సవం సోమవారం గోకర్ణేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా నిర్వహించారు. పూజారి మహేష్‌స్వామి సమక్షంలో గురు శివస్వాములు శివశంకర్, సంగమేశ్వర్ దంపతులతో కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం కల్లేటి సంధ్య అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాయికోడ్ టీపీసీసీ మెంబర్ మున్నూరు కిషన్, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు శ్యామ్‌రావు, రాధా కిషన్‌గుప్తా, వట్‌పల్లి మార్కెట్ కమిటీ ట్రేడ్ డైరెక్టర్ శ్రీధర్‌గుప్తా, రమేష్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

ఆలయాల సందర్శన పెరగాలి

పటాన్‌చెరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల సందర్శన పెరగాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. కార్తీక మాసం పూజలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధి ఉమామహేశ్వరాలయంలో లక్ష బిల్వార్చనలో పాల్గొన్నారు. శివలింగానికి అభిషేకం జరిపారు. అనంతరం బిల్వార్చన పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సౌజన్య

సంగారెడ్డి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య తెలిపారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ప్రతీ మహిళ తన హక్కులను తెలుసుకోవడం, చట్టాన్ని అర్థం చేసుకోవడం, అవసరమైనప్పుడు న్యాయ సహాయం పొందడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి



పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న డీఎస్పీ సైదానాయక్

జహీరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాలుష్య నివారణకు మొక్కలు ఎంతో దోహద పడుతాయాని జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ అన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసులు మొక్కలు నాటి మాట్లాడారు. వందేమాతరానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మొక్కలు నాటామన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ సీఐ శివలింగం, జహీరాబాద్ టౌన్ ఎస్ఐ వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి : సీడీపీవో

రేగోడు/మెదక్/హవేళిఘణపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను ముందుగానే గుర్తించి అరికట్టాలని, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సీడీపీవో పద్మలత అన్నారు. సోమవారం రేగోడు ఇందిరాక్రాంతి కార్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దత్తారెడ్డి, ఎంపీడీవో సీతారావమ్మ, ఎంఈవో గురునాథ్ పాల్గొన్నారు. మాసాయిపేట మండలంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి ఆధ్వర్యంలో, హవేళిఘణపూర్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రేయాంత్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు చేస్తే జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

స్వప్నకు పీహెచ్‌డీ



సంగారెడ్డి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణితశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని స్వప్న దాచేపల్లి డాక్టరేట్‌కు అర్హత సాధించారు. మైక్రోపోలార్, నానో ఫ్లూయిడ్ సమస్యలపై వేడి, ద్రవ్యరాశి బదిలీ విశ్లేషణ, గణన పరిష్కారాలు అనే అంశంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించడంతో పట్టా అందించారు.

దాతర్‌పల్లి అటవీ ప్రాంతంలో చిరుత

తూప్రాన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మండలం దాతర్‌పల్లి అటవీ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం చిరుత పులి కనిపించినట్లు గ్రామస్థులు తెలిపారు. మొన్నటివరకు మండలంలోని గుండ్రెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో కనిపించిన చిరుతపులి.. పక్కనే ఉన్న దాతర్‌పల్లి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు చెబుతున్నారు. మల్కాపూర్‌కు చెందిన ఓ యువకుడు కారులో వెళ్తుండగా.. దాతర్‌పల్లి ఊరు పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలోని రోడ్డు పైనుంచి వెళ్తూ కనిపించిందని తెలిపాడు. గ్రామస్థులకు సమాచారం ఇవ్వడంతో సాయంత్రం అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టినట్లు తెలిపారు. తూప్రాన్ మండలం మల్కాపూర్, గుండ్రెడ్డిపల్లి, ఇస్లాంపూర్, కోనాయపల్లి(పీటీ), మాసాయిపేట మండలం పోతిన్‌పల్లి గ్రామస్థులు, సిద్దిపేట జిల్లా మాచిన్‌పల్లి తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

చిలేపల్లి శివారులో...

ఝరాసంగం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఝరాసంగం మండలంలోని చిలేపల్లి శివారులో చిరుత సంచరిస్తున్నట్లు కొందరు గమనించి గ్రామంలో తెలియజేయడంతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. చిలేపల్లి శివారులో కొంతమంది రైతులు తమ పొలాల్లో సోమవారం పనిచేస్తుండగా అటు నుంచి వెళ్తున్న చిరుతపులిని చూసి భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయాన్ని గ్రామంలోని పలువురి పెద్దలకు తెలియజేశారు. దీంతో గ్రామస్థులు ముందు జాగ్రత్తలో భాగంగా చాటింపు నిర్వహించి, ప్రజలను అప్రమత్తం చేశారు.



చిలేపల్లిలో రాత్రి డప్పుచప్పుడు చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను కాపాడేందుకు, అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో రోడ్లు-భవనాలు, పోలీస్, రెవెన్యూ, ఫైర్, మున్సిపల్ శాఖలను కలిపి రాష్ట్ర ప్రభుత్వం జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. సదాశివపేట బల్దియాలో మాత్రం పరిధిలో ఈ కమిటీ జాడ కనిపించడం లేదని విమర్శలున్నాయి.

స్కౌట్స్, గైడ్స్‌కు లింగంపల్లి స్కూల్ ఎంపిక

- స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర కమిషనర్ మోహన్‌రావు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న స్కౌట్స్, గైడ్స్ ప్రతినిధులు

మునిపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోనే లింగంపల్లి గురుకుల సొసైటీ పాఠశాల, కళాశాల ఎంపిక కావడం గర్వకారణమని స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర కమిషనర్ మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని లింగంపల్లి గురుకుల సొసైటీ పాఠశాలలో నిర్వహిస్తున్న స్కౌట్స్, గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో బేసిక్ కోర్స్ కార్యక్రమాన్ని సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముందుగా కార్యక్రమాన్ని లీడర్ ట్రైనింగ్ గైడ్ భరతమాత, హిమాలయ హుడ్ బాడ్జీ సాల్మన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీడర్ రవికిరణ్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి మాధవరెడ్డి, మునిపల్లి ఎంఈవో భీంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలతో ఇబ్బందులు

రామచంద్రాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్‌లోని గేటెడ్ కమ్యూనిటీ నివాసితుల పరిసర ప్రాంతాల్లో అక్రమ లేబర్ షెడ్ల కారణంగా ఇబ్బందులు పడుతున్నట్టు స్థానికులు ప్రదీప్‌రెడ్డి, సతీష్, ప్రసాదురాజు, మన్మోహన్, నీరజ్, రాజు, నాగేశ్వర్‌రావు, వీరనారాయణ, ఈశ్వరీగారి రమణ తెలిపారు. సోమవారం ఆ విషయమై మున్సిపల్ కమిషన్ అజయ్‌కుమార్‌రెడ్డి, సీఐ గణేష్ పటేల్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్లలో వేలాది మంది కార్మికులు నివాసముంటున్నారని తెలిపారు. వేల సంఖ్యలో కార్మికులు నివాసముండటంతో రోడ్డు పక్కన దుకాణాలు పెరిగాయన్నారు. కొన్నిచోట్ల ప్రభుత్వ స్థలాలను ఆక్రమణలకు గురౌతున్నాయని వివరించారు. వెంటనే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

పచ్చదనం పరిరక్షణకు బోరునీరు

రామచంద్రాపురం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పచ్చదనం పరిరక్షణకు నీటి వనరులు సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. సోమవారం అర్బన్ బయోడైవర్సిటీ పథకం కింద రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్‌లో బోరు వేసే పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, నగేష్, శ్రీశైలం, సామ్రాట్, వీరేశం, నవీన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో జాగ్రత్త

పటాన్‌చెరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వీధి కుక్కలతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఐడీఏబొల్లారం మున్సిపల్ కమిషనర్ కిషన్ చెప్పారు. పట్టణవ్యాప్తంగా ప్రమాదకరంగా మారిన కుక్కలను పట్టే కార్యక్రమం ముమ్మరంగా చేస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకు 190 శునకాలను పట్టుకొని యాంటీ రేబీస్ వ్యాక్సిన్లు వేయిస్తున్నామని తెలిపారు. కుటుంబనియంత్రణ ఆపరేషన్లు నిర్విరామంగా జరుగుతున్నాయని తెలిపారు. శునకాల వద్దకు వెళ్లనివ్వకుండా చిన్నారులను తల్లిదండ్రులు కట్టడి చేయాలని చెప్పారు.

అంబులెన్స్‌లో ప్రసవం

చేగుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవించిన సంఘటన చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన స్రవంతి నిండు గర్భిణి. పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారమందించారు. పెద్దశంకరంపేట్ అంబులెన్స్ సిబ్బంది ఆమెను గజ్వేల్ ఆస్పత్రికి తరలిస్తుండగా.. రుక్మాపూర్ శివారులోకి వెళ్లగానే నొప్పులు అధికమయ్యాయి. గమనించిన టెక్నీషియన్ మంజుల అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. స్రవంతి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. వారిని గజ్వేల్ ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

హవేళిఘణపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్తాయికోట గ్రామంలోని సిద్ధేశ్వరాలయంలో కార్తీకమాసం పురస్కరించుకొని సోమవారం పూజారి గోవింద్‌మహరాజ్ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు సమీప గ్రామాల ప్రజలతో పాటు మెదక్ పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఇందులో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి కూడా పాల్గొన్నారు.

చాకరిమెట్లలో కార్తీకశోభ

శివ్వంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్న గొట్టిముక్కల శివారులోని చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో స్వయంగా వెలిసిన సహకార ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక శోభ సంతరించుకుంది. ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన పూజారి దేవదత్తశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు, సామూహిక వ్రతాలు నిర్వహించారు. అనంతరం సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలను నిర్వహించి కార్తీక వన భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సార శ్రీనివాస్, పూజారులు దేవి ప్రసాద్‌శర్మ, శ్రీ వాత్సవ శర్మ, ప్రభురాజ్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

వీధి దీపాల్లేక ఇబ్బందులు

శివ్వంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వీధి దీపాలు లేక మండల పరిధిలోని బోజ్యతండా పంచాయతీలోని మాల్యతండా గిరిజన తండావాసులు చీకట్లో మగ్గుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి కృష్ణ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గిరిజనవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేసేలా కృషి చేయాలని కోరుతున్నారు.